


# కథ

జి.పద్మావతి

# ఏమరితే

"సార్! ఈ బస్సు చిన్నగాంధీ బొమ్మ సెంటర్‌కి వెళుతుందా?" డోర్ దగ్గర నుంచుని అడిగింది హేమ.

"ఆ.. వెళుతుంది. కానీ ఇది చుట్టూ తిరిగి వెళుతుంది. కొంచెం ఆలస్యం అవుతుంది" ఓపిగ్గానే చెప్పాడు కండక్టరు.

'నాక్కావలసిందీ ఆలస్యంగా వెళ్ల డమే!' అనుకుంటూ గబగబా ఎక్కి మధ్యనున్న సీట్లలో ఒక పెద్దావిడ పక్కన కూర్చుంది. చూడగానే నిమి షాల మీద బస్ నిండిపోయింది. 'హమ్మయ్య' అనుకుంటూ కిటికీ లోంచి చూసింది. రోజూ తను వెళ్లే బస్సు వెళ్లిపోవడం చూసి రిలాక్స్‌డ్‌గా సర్దుక్కూర్చుంది. బేగ్ వళ్లో సర్దుకుని మంచినీళ్లు తాగి ఎందుకైనా మంచిదని చున్నీ చెవుల మీద నుండి తలకి చుట్టుకుంది.

కండక్టరు వచ్చి టికెట్స్ తీసుకుంటున్నాడు. డబ్బులిచ్చి టికెట్ తీసి పర్సులో పెట్టుకుని తల ఎత్తేసరికి ఎదురుగా బ్లాక్ షర్ట్, ఆమె గుండె ఝల్లుమంది. వెన్నులో వణుకు మొదలయ్యింది. చెమట్లు పట్టసాగాయి.

'హమ్మో!... ఇందులోక్కూడా ఎక్కేశాడా? ఎలా ఇప్పుడు!? వీడి నుండి తప్పించుకోడానికి ఇలా తిప్పి తిప్పి తీసుకెళ్లే బస్సు ఎక్కింది. ఇంతసేపూ ఈ టార్చర్ భరించాలా?' లోలోపలే అనుకుంటూ కర్చీఫ్‌తో మొహం తుడుచుకుంది.

'దేవుడా! కాపాడు ప్లీజ్..' మనసులో ధైర్యం చెప్పుకుంటూ బెరుగ్గా పక్కకి చూసింది హేమ.

'ఇతనింకా ఎత్తుగా ఉన్నాడు!' అనుకుంటూ ధైర్యంగా చూసింది హేమ.

'థేంక్ గాడ్! కాదు! ఒక్క నిమిషం ఎంత టెన్షను అనుభవించాను. ఇవాళకిలా తప్పించుకున్నాను. మరి రేపు!? ఇలా ఎన్నాళ్లు?' ఆమె ఆలోచనల్లో ఉండగానే సరిగా అర్థ గంట తర్వాత ఆమె దిగే సెంటర్‌కెళ్లింది బస్సు. రోజూ వెళ్లే రూట్‌లో కాకుండా పక్క వీధిలోంచి నడిచి వెళ్లింది హేమ. సరిగ్గా ఇంటికెళ్లేసరికి డోర్ లాక్ చేసుంది.

'అరే... అమ్మ ఈ టైమ్‌లో ఎక్కడికెళ్లింది. రాత్రి ఎనిమిదవుతుంది కదా!' అనుకుంటూ బ్యాగ్ తీసి కింద పెట్టి డోర్ దగ్గర నుంచుంది తల్లిని విసుక్కుంటూ.

"ఇవిగోనమ్మా తాళాలు. ఏమిటో రోజుకో టైమ్‌కొస్తావు. చూసీ చూసీ ఇప్పుడే మీ అమ్మ బయటికి వెళ్లింది. మా పిల్లలూ చదువుకున్నారు. సరిగ్గా ఐదు గంటలకల్లా ఇంటిలో ఉండేవారు. నీకు ఉద్యోగం కూడా ఉంది మరి. అందుకే అలస్యం అయినట్లుంది!" అన్నీ తనే మాట్లాడేసి నిష్ఠూరంగా "ఏం చదువులో ఏమిటో అదో వంక!" అంటూ తాళాలు చేతికందించి తలుపేసుకుని వెళ్లిపోయింది.

ఆవిడకి సమాధానం చెప్పలేక 'అమ్మకి అంత కొంపలంటుకుపోయే పనులేమిటో' అని తిట్టుకుంటూ, అన్నీ తెలిసి ఎలా మాట్లాడుతుంటారో ఇలాగ, అప్పటి చదువులు ఇప్పుడున్నాయా? పైగా తను జాబ్ చేసుకుని సాయంత్రం కోచింగ్ సెంటర్‌కి వెళ్తుంది. ఆలస్యం అవ్వకుండా ఎలా కుదురుతుంది! కొంచెంసేపు పైకి, కొంచెం సేపు మనసులోనూ తిట్టుకుంటూ ఫ్రెష్ అయ్యింది హేమ.

కోచింగ్ క్లాసులో చెప్పినవి రిపీట్ చేద్దామని బుక్స్ తీసే లోపల లాండ్ ఫోన్ మోగింది. 'అమ్మ చేసుంటుంది' అనుకొని ఒక్క పరుగులో ఫోన్ తీసింది హేమ.

"హలో! ఎక్కడికెళ్లిపోయావు? ఏమైపోయావు? నీ కోసం బస్టాండ్ అంతా వెతికాను. నువ్వు రోజూ వెళ్లే బస్సు ఖాళీగా ఉంది. రేపు ఆఫీసు దగ్గర వెయిట్ చేస్తాను. నిన్ను చూడకుండా నాకు క్షణం గడవదు. ఐ లవ్ యూ హేమా... నన్ను అర్థం చేసుకో. నువ్వు కనిపించకపోతే..." ధన్‌మని ఫోన్ పెట్టేసింది హేమ.


మళ్లీ మోగింది. అదే నెంబరు.

'ఈ ఫోన్ నెంబరు ఎలా కనిపెట్టాడు? రెండు రోజుల క్రితమే కావాలని నెంబరు మార్పించుకున్నాం. యమదూతలా ఫాలో అయ్యి చంపేస్తున్నాడు. వీడి వల్లనే అందరితోటీ మాటలు పడవలసి వస్తుంది. ఎంత టార్చర్ పెడుతున్నాడు. ఎన్నాళ్లు తప్పించుకోను... చెప్పుకోడానికి కూడా ఎవరూ లేరు' ఆమెకు దుఃఖం తన్నుకొచ్చింది.

'అందంగా ఉండడం కూడా శాపమేనా... లేక ఆడపిల్లల బ్రతుకులే ఇంతా... రెండు నిమిషాల్లో తిని పడేసే ఐస్ క్రీం ఫ్లేవర్ కూడా నచ్చింది కొనుక్కుంటాం. అలాంటిది జీవితాంతం ఉండే పార్టనర్ నచ్చకపోతే ఎలా ఒప్పుకోవాలి? వద్దన్నానని అందరితో ఇష్టం వచ్చినట్లు చెప్తున్నాడు. నాకూ అతనంటే చాలా ఇష్టమని, ఎక్కడెక్కడికో ఇద్దరం షికారుకెళ్లినట్లు చిత్రించి చెప్తున్నాడు. పూర్తిగా తమ గురించి తెలిసిన వాళ్లు కూడా నిష్ఠూరంగా మాట్లాడ్తున్నారు. నాన్న ఉండుంటే కొంచెం భయపడేవాడేమో! తప్పు చేసినట్లు ఇలా తప్పించుకు తిరగడం ఎందుకు? అస్సలు ప్రాణాలతో లేకపోతే.. ఏ గొడవా ఉండదు' స్థిరంగా నిర్ణయించుకుని కళ్లు తుడుచుకుంది హేమ.

రెండే రెండు నిమిషాలు, తల్లి కూడా ఇంట్లో లేదు! అనుకుంది తల్లికి డాక్టరుగారు రాసిన నిద్రమాత్రల కోసం వెతికింది. ఎంతకీ దొరక్కపోయేసరికి చున్నీ తీసుకుందామని బీరువా తలుపు తీసింది. బట్టలతో పాటు తండ్రి ఫోటోలు కింద పడ్డాయి. 'అమ్మని నువ్వే చూసుకోవాలి' నాన్న మాటలింకా చెవుల్లో వినపడుతున్నాయి. అవును నేనూ చనిపోతే అమ్మ పిచ్చిదైపోదూ... ఎవరో ఏదో అన్నారని మేమెందుకు బలైపోవాలి! అనుకుంది. తండ్రి ఫోటో చేతుల్లోకి తీసుకుని గతంలోకి వెళ్లింది.

ఆ రోజు వారి జీవితాల్లో చీకటి మిగిల్చిన భయంకరమైన రోజు. "నువ్వు ఎం.బి.ఏ పూర్తి చేసి ఇంకా హైయ్యర్ స్టడీస్‌కి ఫారిన్ వెళ్లి మంచి బిజినెస్ మేగ్నెట్ అవ్వాలిరా! మా హేమ నా కలలు నిజం చేసింది అని అందరికీ చెప్పాలి!" కాలేజీకి బైక్ మీద దింపుతూ



అన్నాడు హేమ తండ్రి.

"తప్పకుండా డాడీ... మీరిచ్చే ప్రోత్సాహమే నాకు చాలా పవర్ ఇస్తుంది. ఎంత చదువైనా చదువుతాను" అంటూ కేంపస్‌లో దిగి 'బై' చెప్పింది.

ఆమెను దింపి తిరిగి వెళ్తున్న అతన్ని వెనుక నుండి ఇనుము లోడ్‌తో వెళ్తున్న లారీ డాష్ ఇచ్చింది. వారి కలలన్నీ ఛిద్రమైపోయాయి. రెండు రోజులు హాస్పిటల్‌లో కోమాలో ఉండి మూడవ రోజు స్పృహ లోకా చ్చాడు ఆయన. ఆ ఆనందం ఎంతసేపో మిగల్లేదు.

"అమ్మని చూసుకోమ్మా! నువ్వు చదువు ఆపద్దు. నీ చదువే నీకు తోడు" అంటూ తిరిగిరాని లోకాలకెళ్లిపోయారు.

ఆయన ఉద్యోగం హేమ తల్లికి ఇచ్చేందుకు ప్రయత్నం చేశారు పెద్దవాళ్లు. కానీ ఆమె షాక్ నుండి తేరుకోలేదు. తప్పని పరిస్థితుల్లో కొంచెం తక్కువ గ్రేడ్ జాబ్‌లో చేరింది. ఫైనల్ ఇయర్ పూర్తి అయితే తండ్రి పనిచేసిన పోస్ట్ ఇస్తారు.

అందు కని కష్ట పడి పగలు అయిదు గంటల వరకు ఆఫీసు వర్క్ చేసుకుని సాయంత్రం కోచింగ్ సెంటర్‌లో చేరింది హేమ.

రెండూ జాగ్రత్తగా మైంటైన్ చేసుకుంటూ చదువుమీద శ్రద్ధతో ఎంతో కష్టపడుతుంది. అదిగో అక్కడ కోచింగ్ సెంటర్ దగ్గర పరిచయమై ఆ నోట్సనీ, సబ్జెక్టు అర్థం కాలేదని పరిచయం పెంచుకుని, తను 'నో' చెప్పిందని ఈ విధంగా టార్చర్ పెడుతున్నాడు. 'యమదూత' మళ్లీ తిట్టుకుంది హేమ. తండ్రి ఫోటోలు చూస్తూ దుఃఖం ఆపుకోలేక, పరిస్థితులు తట్టుకోలేక వెక్కి వెక్కి ఏడుస్తూ కూర్చుండిపోయింది.

రెండు రోజుల ముందు "నీ అందం మకరందం, నీ కళ్లు, స్ట్రక్చర్ ఏ హీరోయిన్కూ పనికి రాదు" అంటూ కూడా పద్దాడు. తన అందం మీదే అతని దృష్టి అనుకుంది.

"నాకొక గోల్ ఉంది. అందుకే కష్టపడుతు న్నాను" అనంది హేమ.

"ఎందుకు కష్టపడ్డం. మీ ఇద్దర్నీ నేను పోషి స్తాను. అయినా నీకు ఉద్యోగం ఉందిగా! అది సరిపోదా!"

"నా ఉద్యోగం సరే, నువ్వెలా పోషి స్తావు?" కోపంగా అంది.

"నీకు నా మీద సాఫ్ట్‌కార్నర్ ఉంది కాబట్టే సమస్య ఆలోచిస్తున్నావు. లేకపోతే మా బ్రతుకు మేం బ్రతు కుతాం అనే దానివి, అంటే నేనంటే నీకిష్టమే" అంటూ సినిమా డైలాగులు చెప్పేసరికి హేమ అతని చెంప మీద గట్టిగా లాగి కొట్టింది. అప్పట్నుండీ మరీ పని కట్టుకుని ఆఫీస్ దగ్గరా, బస్ కాంప్లెక్స్ దగ్గరా, దారిలోనూ వేధిం చడం ఎక్కువ చేసేవాడు. తెలిసిన వాళ్లందరికీ చెడుగా చెప్పడం, నేనెందుకు నచ్చలేదంటూ హింసించడం ఎక్కువైపోయింది. రకరకాల ఆలోచనలు ముసిరేసరికి

తలపట్టుకుని కూర్చుండిపోయింది హేమ. "వీడికి అక్కాచెల్లెళ్లు లేరా? నా బాధ ఎవరిక్కావాలి, అర్థం చేసుకునేదెవరు? అన్నయ్య ఉన్నా బాగుండేదేమో! ఒంటరి పోరాటం చేస్తున్నాను. ఓ గాడ్"

"అమ్మా! హేమా" తల్లి పిలుపుతో ఈ లోకంలోకి వచ్చింది. కళ్లు తుడుచుకుని వెళ్లి తలుపు తీసింది.

"ఎక్కడికెళ్లావమ్మా, ఒంటరిగా ఉండాలంటే భయంగా ఉంది"

"నిన్నూ తీసుకెళ్దాం అనుకున్నాను. నీకాలస్యం అయింది. శాస్త్రిగారు ఏడు గంటల కల్లా రమ్మన్నారు. చూసీ చూసీ వెళ్లాను" అంటూ భరిణ తీసి దేవుడి దగ్గర పెట్టి కాసేపు పూజ చేసి, ఉంగరం తెచ్చి హేమ చేతికి తొడిగింది.

"ఇదేంటమ్మా, నేనేమీ ఉంగరం అడగలేదుగా?" చెయ్యి అటూ ఇటూ తిప్పుదూ అంది.

"ఈమధ్య నీకు టైం బాగాలేదట హేమా! మొన్న గుడికి వెళ్లినప్పుడు, ఏదో సమస్య అని చెప్తేనూ... శాంతి ఉంగరంట! నీ నక్షత్రానికి సరిపడేదని ఇచ్చారు! అందుకే ఇవ్వాళ వెళ్లాను"

"మనుష్యులు మారాలమ్మా! బాధపడేవాళ్లక్కూడా బాధించిన వాళ్లతో భాగస్వామ్యం ఉంటుందంటే ఎలా? ఆ అబ్బాయి అలా చేస్తున్నాడంటే ఈ పిల్ల ఎలాంటిదో.. అంటారే.. వాళ్లు మారాలి కానీ, ఈ రంగురాళ్లు ఏం చేస్తాయి" అంటూ తీయబోయింది ఉంగరాన్ని.

"తియ్యకు, నా నమ్మకం నాది, పోనీ నీ తెల్లటి చేతికి నీలపురాయి ఎంతో అందంగా ఉంది ఉంచు"

★★★

ఆఫీసుకెళ్లే బస్సు ఎక్కకుండా ఆటోలో కాస్త ముందుగానే వెళ్లిపోయింది హేమ. కొత్త ఉద్యోగం కావడం వల్ల, ఆమె తండ్రి మీద ఉన్న అభిమానం వల్లనో మిగిలిన వాళ్లు ఆమెకి వర్క్ విషయంలో సహాయం చేసే వారు. దాని కోసమని సూపర్‌వైజర్ గారి దగ్గర సలహాలు తీసుకుంటుంది హేమ.

"అమ్మా! మీకు ఫోన్ వచ్చింది, ఇంటి దగ్గరనుంచిట" అన్నాడు అటెండరు.

అతనికి ఎవరైనా ఫోన్ చేస్తే 'మీరెవరు' అనడగమని చెప్పి ఉంచింది హేమ. వెళ్లి రిసీవరు తీసుకుంది.

"నేనని చెప్తే నువ్వు రావనే ఇంటిదగ్గర్నుండి అని చెప్పించాను. ఏంటీ పోలీసు రిపోర్టు ఇస్తానన్నావట. హార్టీ వెల్‌కమ్. ఇవ్వు, అక్కడా ప్రేమ విషయమే చెప్తాను. టీవీలో కూడా వస్తుంది. కొట్టారనుకో దెబ్బకో సారి... హేమా, హేమా అంటాను. మీ అమ్మ కూడా ఎందుకొచ్చిన గొడవ... ఏం జరిగితే అది జరుగుతుంది పెళ్లి చేసుకోమన్నా ఒప్పుకోవట్లేదట... ఆవిడ మాట విను...." ఆమెకు తర్వాత ఏం వినపడలేదు, ఫోన్ పెట్టేసింది.

'అమ్మా, నేనూ, మామూలుగా ఇంట్లో అనుకున్న మాటలు వీడికెలా తెలిశాయి. అమ్మ పెళ్లి చేసుకోమంటే నాకంటూ ఒక గోల్ ఉంది. మరీ విసిగిస్తే పోలీసులకు చెప్తాను!' అని అన్న మాటలు బయటికెలా వచ్చాయి?.. సో వాడికి తెలియకుండానే నాకు క్లూ ఇచ్చాడు. అసలు మూలం ఇంటి దగ్గరే ఉందన్నమాట. పరిష్కారమార్గం దొరికినందుకు హేపీగా ఫీలయ్యింది హేమ.

★★★

కోచింగ్ సెంటరు నుండి అరగంట ముందే పర్మిషన్ అడిగి వెళ్లిపోయింది హేమ. ఇంటికెళ్లాక ఫ్రెష్ అయ్యి తల్లిదగ్గర కూర్చుంది. "అమ్మా... ఆంటీ వాళ్లకి మనవడున్నాడు కదా. ఒకసారి అతని గురించి మాట్లాడాలి వెళదాంరా! అతను నేను రాసే పరీక్షలే రాస్తున్నాడట. నేనడిగితే ఆంటీ ఏదో ఒకటి అంటుంది" అని తల్లిని లాక్కెళ్లింది.

"మీరిక్కడే ఉండి మీ మనవణ్ని హాస్టల్‌లో ఎందుకు పెట్టారు!" అని మొదలు పెట్టి ఏవేవో ప్రశ్నలేస్తూనే ఉంది.

"అవును హేమా, ఏమిటి? ఎన్నడూ లేనిది మా వంశీ గురించి అంతగా అడుగుతున్నావు?" ఆవిడ అడిగింది హేమని.

"మొన్న నేను పోలీస్ కంప్లైంట్ ఇచ్చాను కదా, అతని రూం మేట్ అడ్రస్‌లు తీసుకున్నారు. అందులో మీ మనవడి పేరు, కేరాఫ్ మీ అడ్ర



## మరో ప్రయత్నం

తెలుగులో 'ఒట్టేసి చెపుతున్నా' అనే సినిమాలో హీరోయిన్‌గా నటించిన స్రవంతి ఆ తర్వాత అడ్రస్ లేకుండా పోయింది. చూడ్డానికి ఎంతో సాఫ్ట్‌గా కూల్‌గా కనిపించే స్రవంతి అసలు పేరు కనిహ. తమిళంలో కొన్ని సినిమాలు చేసాక పెళ్లి చేసుకుని అమెరికా చెక్కేసిందిట. అయితే మళ్లీ ఇప్పుడు తిరిగొచ్చి తమిళ సినిమాల్లో ట్రయ్ చేసుకుంటోందిట. కానీ ఆమెకి తమిళం కన్నా మలయాళంలో ఆఫర్లు వస్తుండడంతో అక్కడికే వెళ్లేందుకు సిద్ధమవుతోంది. అయినా బిట్స్ పిలానీ గ్రాడ్యుయేట్ అయిన స్రవంతి ఈ సినిమా పిచ్చేంటో!

స్నుంది!" తొణక్కుండా ధైర్యంగా చెప్పింది హేమ.

"వాడలాంటి వాడు కాదు, నిన్ను అనుమానంగా మాట్లాడానని మా వాడినంటున్నావు" కోపంగా అంది.

"మీరే చెప్తున్నారుగా, మా అమ్మాయి మాట వినట్లేదని హాస్టల్‌లో పెట్టిందని, అర్జెంటుగా అతన్ని ఇంటికి రమ్మని ఫోన్ చేయండి. లేదంటే నేనేం చేయలేను" అనంది హేమ.

సాయంత్రం... పావుగంటలో అతను ఇంటికి వచ్చాడు.

"మా ఫోన్ నెంబర్లు, మా ఇంట్లో ఏం జరిగిందీ, మీ అమ్మమ్మ దగ్గర తెలుసుకుని ఎలా హెల్ప్ చేశావో మాకూ అలాగే చేయి. ఫ్రెండ్స్ ఇలాంటి వాటిలో 'సహాయ నిరాకరణోద్యమం' చేయాలి. ఇద్దరిష్టపడితే వాళ్లే చెప్పుకుంటారు. స్నేహితుల పాత్ర అవసరం లేదు. సో, మాకూ అతని గురించి వివరాలు చెపితే నీ పేరు పోలీసులకు చెప్పకుండా చూస్తాను" అంది హేమ నిశ్చయంగా.

★ ★ ★


అప్పటికి సరిగ్గా వారం తర్వాత హాయిగా ఆఫీసుకెళ్లి, వీలైతే నడుచుకుంటూ ఇంటికి కూడా వస్తోంది హేమ. కోచింగ్ సెంటర్‌క్కూడా వెళ్లి శ్రద్ధగా చదువుకుంటోంది. ఆఫీసుకి దగ్గరగా తెలిసిన వాళ్ల ఇల్లు అద్దెకు తీసుకున్నారు.

"నీ ధైర్యం చూస్తే నాకు ఆశ్చర్యంగా ఉంది. అసలేం చేశావు! నాకేం అర్థం కాలేదు" తల్లి అడిగింది హేమని.

"ఆ రోజు మనం ఆంటీని అడిగితే వాళ్ల మనవడు వచ్చాడా? అతనిచ్చిన ఆధారంతో మా కోచింగ్ సెంటరు డైరెక్టర్ గార్ని రిక్వెస్ట్ చేశాను. వంటరివాళ్లమని ప్రాధేయపడ్డాను. వాడి తల్లిదండ్రులది ఇక్కడ కాదు. పక్కనే ఉన్న పల్లెటూరు. ఆయన శ్రమ తీసుకుని నా కోసం అక్కడికెళ్లారు"

"కూడా వంశీని పంపించాల్సింది. అంతా వాడేగా చేశాడు. నేనేదో పక్కింటివాళ్లు పెద్దావిడ కదాని కష్టం సుఖం చెబితే మనవడికి చెప్తుందా" కోపంగా అంది హేమ తల్లి. "పైగా నిన్ను ఏదో ఒకటి అనేది" చిరాగ్గా అంది.

"ఆవిడ తప్పూ లేదమ్మా! ఏదో మామూలుగా అడిగాదనుకుంటుంది పాపం పెద్దావిడ. ఎవర్నీ తీసుకెళ్లలేదు మా కోచింగ్ సార్. వాళ్ల పెద్దాళ్లతో కలిసి 'మీవాడి మీద చాలా కంప్లైంట్లు వస్తున్నాయి. మార్కులూ ఎటూ లేవు. సరిగ్గా చదవడు. ఆడపిల్లల్ని టార్చర్ పెడుతున్నాట్ట. వాళ్లు పోలీస్ రిపోర్టు ఇచ్చారు. కన్నందుకు మీరు, టీచర్‌గా నేనూ, అతనితో పాటూ ఊచలు లెక్కపెట్టాలి. నేనూ పంపించేస్తాను. హైదరాబాద్‌లో నాకు తెలిసిన మంచి కోచింగ్ సెంటర్ ఉంది. మీరూ కోపరేట్ చేయండి. లేదంటే, రోజూ ఎన్నో మనం పేపర్లో చూస్తున్నాం కదా, మీరు అతన్ని మర్చిపోవాల్సి ఉంటుంది' అని చెప్పారట. తెల్లారేసరికి వాళ్ల నాన్నగారు వచ్చి తీసుకెళ్లిపోయారు. ముందు గొడవ చేశాడట... అయితే జైల్లో కూర్చో, అన్నారట. అదే జరిగింది. మన చుట్టూ ఉన్నవాళ్లు బాధ్యతగా తీసుకుంటే ఇలాంటివి పెరగవు. అంతేకాదు హేట్సాఫ్ టూ పోలీస్! కనీసం ఆ పేరు చెప్తేనే భయపడేవాళ్లింకా ఉన్నారు" సంతోషంగా చెప్పింది హేమ.



"అంతా ఉంగరం మహిమేనే, ఏదో గొడవ సర్దుకుంది" దణ్నాలు పెట్టుకుంటూ అంది హేమ తల్లి.

★ ★ ★

"హలో... అయామ్ శశాంక్, కొత్తగా జాయినయ్యాను. మీ నోట్సు ఒకసారి ఇస్తారా? కాపీ చేసుకుని ఇస్తాను" హేమనడిగాడు కొత్తగా వచ్చినబ్బాయి.

"కొత్త ప్రాబ్లమా!" హేమనడిగింది పక్కనమ్మాయి.

"పలకరిస్తేనే ప్రాబ్లం కాదు కదా, వెయిట్ అండ్ సీ... ఆడపిల్లగా పుట్టినందుకు ఈ ఎదురీతలు తప్పవేమో! సమాజం మారేదాకా వేచి చూడాలి. ఒకప్పుడు చచ్చిపోదామనుకున్నాను. ప్రతీ సమస్యకీ పరిష్కారం ఉంటుంది. ఎదిరించి నిలబడాలి. అప్పుడది చిన్న సమస్యే" నవ్వుతూ అంది హేమ.

## కరీనా నిర్ణయం

కరీనా కపూర్ తాజాగా ఓ నిర్ణయం తీసుకుందిట. ఏదైనా పబ్లిక్ ఫంక్షన్‌లాంటి వాటికి హాజరయ్యేటప్పుడు ఇకపై చీర ధరించే వెళ్లాలనుకుంటోందిట. అలాగని తన తల్లి బబితకి మాట ఇచ్చిందిట. అలాగే కాబోయే అత్తగారు షర్మిలా టాగూర్ (సైఫ్ తల్లి) కోరిక కూడా ఇదేనట. అందుకనే తన తల్లి, అత్తగారు నచ్చే విధంగా బయట ఫంక్షన్‌లలో చీరతోనే కనిపించేందుకు సిద్ధమంటోంది కరీనా. బాగానే వుంది, మరి తెరపై టూపీస్ బికినీలు, చిట్టిపొట్టి దుస్తుల మాటేమిటీ? అని బుగ్గలు నొక్కుకుంటున్నాను సినీజనాలు.